

వలస.. ఏదీ భరోసా?
ఉపాధి కోసం ఉమ్మడి జిల్లా వాసులు వలస బాట పడుతున్నారు. నేడు అంతర్జాతీయ వలసదారుల దినోత్సవం నేపథ్యంలో ప్రత్యేక కథనం. 8లో▸



జనసంద్రంగా వారసంత!
కెరమెరి మండల కేంద్రంలో ఆదివారం వారసంత జనంతో కిక్కిరిసింది. తినుబండారాలు, చెరుకు విక్రయాలు చేస్తూ జనం సందడి చేశారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
27.9 /16.4

వాతావరణం
ఆకాశం ఉదయం పూట మేఘావృతమై ఉంటుంది. చలి తీవ్రత కొనసాగుతుంది. పొగమంచు ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

'బండి'ని కలిసిన ఎమ్మెల్యే హరీశ్‌బాబు



బండి సంజయ్‌తో ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌టౌన్: సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు భారతీయ జనతా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేగా విజయం సాధించిన అనంతరం తొలిసారి కరీంనగర్‌లోని మహాశక్తి ఆలయంలో ఆదివారం బండి సంజయ్‌ను కలిశారు. ఆలయంలో పూజలు చేశారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన వారిని ఆదివారం ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి సాంబశివరావు, పీడీ తిరుపతితో కలిసి అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో బెల్లంపల్లిలో నిర్వహించిన అండర్ 14 జోనల్ స్థాయి పోటీల్లో పాఠశాలకు చెందిన మీనాక్షి, దివ్య తృతీయ స్థానంలో నిలిచారని పేర్కొన్నారు. అండర్ 19 విభాగంలో విద్య, స్ఫూర్తి ఉత్తమ ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు.

సీపీఎం జిల్లా ప్లీనరీ జయప్రదం చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని రోజ్ గార్డెన్‌లో ఈ నెల 25న నిర్వహించే సీపీఎం పార్టీ జిల్లా ప్లీనరీని జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దుర్గం దినకర్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో ఆదివారం పార్టీ నాయకులతో కలిసి ప్లీనరీకి సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమావేశాలకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర నాయకులు వీరయ్య, బండారు రవికుమార్ హాజరుకానున్నట్లు తెలిపారు. జిల్లాలోని ప్రధాన ప్రాజెక్టులకు మరమ్మతులు చేపట్టాలనే డిమాండ్‌తో రాష్ట్ర నాయకులు జిల్లాకు రానున్నారని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లాలో పోడు భూములు, రహదారులు, విద్య, వైద్యం, ఇతర మౌలిక సౌకర్యాల కల్పనపై చర్చించనున్నట్లు వెల్లడించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, కార్తీక్, రాజేందర్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా పెన్షనర్స్ డే



పెన్షనర్‌ను సన్మానిస్తున్న నాయకులు, విశ్రాంత ఉద్యోగులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని విశ్రాంత సంఘం భవనంలో ఆదివారం పెన్షనర్స్ డేను ఘనంగా నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కర్నాగౌడ్‌తో కలిసి జెడ్పీటీసీ ఫోరం జిల్లా అధ్యక్షుడు అరిగెల నాగేశ్వర్‌రావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకొన్నారు. అనంతరం సామూహికంగా జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా అరిగెల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బెనిఫిట్స్ సక్రమంగా అందేవిధంగా చూస్తామన్నారు. అనంతరం ఇటీవల పదవీ విరమణ పొందిన ఉద్యోగులను శాలువాలతో సత్కరించారు. ఎంపీపీ మల్లికార్జున్, విశ్రాంత ఉద్యోగులు సుభాష్, నాంపల్లి శంకర్, వెంకన్న, అచ్యుత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చన్నీటి గోస!

జిల్లాలో వారం రోజులుగా చలి తీవ్రస్థాయిలో వణికిస్తోంది. ఏజెన్సీ ప్రాంతాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు దాదాపు 10 డిగ్రీల సెల్సియస్‌కు చేరువవుతున్నాయి. ఉదయం తొమ్మిది దాటినా చలి తగ్గడం లేదు. ఇలాంటి పరిస్థితులు.. రోజురోజుకూ పెరుగుతున్న చలితో హాస్టళ్లలో చదువుకుంటున్న విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చన్నీటి స్నానాలతో గోస పడుతున్నారు.

- గురుకులాలు, కేజీబీవీల్లో పనిచేయని సోలార్ వాటర్ హీటర్లు
- బిగించిన ఏడాదికే మూలకు..
- ఏడేళ్లుగా మరమ్మతులు చేపట్టని వైనం
- రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన పరికరాలు నిరుపయోగం
- చలిలో విద్యార్థులకు తప్పని తిప్పలు



మోడి కేజీబీవీలో నిరుపయోగంగా సోలార్ వాటర్ హీటర్లు

కెరమెరి(ఆసిఫాబాద్): ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న కస్తూరిబా గాంధీ విద్యాలయాల్లో ప్రవేశాలకు ఏటేటా ఆదరణ పెరుగుతోంది. అయితే విద్యార్థినులకు మెరుగైన వసతులు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 15 కేజీబీవీలు ఉన్నాయి. 2015- 16 విద్యాసంవత్సరంలో విద్యార్థినులకు వేడి నీటిని అందించేందుకు 11 విద్యాలయాల్లో సోలార్ హీటర్లు అమర్చారు. అమర్చిన ఏడాదికే పరికరాలు మూలకు చేరాయి. ఏడేళ్లుగా మరమ్మతులు చేపట్టకపోవడంతో విద్యార్థినులకు తిప్పలు తప్పడం లేదు. ఎముకలు కొరికే చలిలో చన్నీటితోనే స్నానాలు చేస్తున్నారు. ఆదర్శ పాఠశాలలు, గిరిజన ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లోనూ ఇదే పరిస్థితి ఉందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కస్తూరిబా విద్యాలయాల్లో 2023- 24 విద్యా సంవత్సరంలో 4,920 మంది విద్యార్థినులు చదువుకుంటున్నారు. జిల్లాలోని రెండు మోడల్ స్కూళ్లలో 1,587 మంది, 44 ఆశ్రమ పాఠశాలల్లో 10,891 మంది విద్యనభ్యసిస్తున్నారు.

ఆరు హీటర్ల చొప్పున పంపిణీ..
జిల్లాలోని 15 కేజీబీవీల్లో కెరమెరి, సిర్పూర్(టి), వాంకిడి, రెబ్బెన, తిర్యాణి, కౌటాల, బెజ్జూర్, కాగజ్‌నగర్, సిర్పూర్(యూ) విద్యాలయాల్లో వాటర్ హీటర్లు బిగించారు. 11 కేజీబీవీలకు ఆరు హీటర్ల చొప్పున మొత్తం 66 పరికరాలు అమర్చారు. ఒక్కోదానికి రూ.1.50 లక్షల చొప్పున వెచ్చించారు. కనీసం మూడేళ్ల వరకు ఇవి పని చేయాల్సి ఉన్నా.. బిగించిన ఏడాదికే మరమ్మతులకు గురవడంతో నిరుపయోగంగా మారాయి. దీంతో రూ.లక్షల ప్రభుత్వ నిధులు వృథాగా మారాయి. అయితే గతంలో కేజీబీవీల పర్యవేక్షణ ఐటీడీఏ పరిధిలో ఉండేది. ఆ తర్వాత ఎస్‌ఎస్‌ఏల పరిధిలోకి మారింది. ఈ కారణంగా సోలార్ వాటర్ హీటర్ల మరమ్మతులకు నిధులు ఎవరూ కేటాయించాలనే అంశంపై అయోమయం నెలకొంది. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు అనంతరం ప్రారంభించిన జైనూర్, చింతలమానెపల్లి, పెంచికల్‌పేట్, ఆసిఫాబాద్ కస్తూరిబా విద్యాలయాలకు అయితే ఇప్పటివరకు సోలార్ హీటర్లు కూడా మంజూరు చేయలేదు. ఆయా పాఠశాలల అధికారులు, ప్రిన్సిపాళ్లు వాటర్ హీటర్ల కోసం ఉన్నతాధికారులకు నివేదికలు అందిస్తున్నా ఇప్పటి వరకు మోక్షం కలగలేదు.

విద్యార్థులకు తిప్పలు
కస్తూరిబా విద్యాలయాలు, ఆశ్రమ పాఠశాలలు, మోడల్ స్కూళ్లలో గతంలో అమర్చిన సోలార్ వాటర్ హీటర్లు వివిధ కారణాలతో మూలకు చేరాయి. కొన్ని కేజీబీవీల్లో వాటర్ హీటర్ల గ్లాసులు పగిలిపోయాయి. మరికొన్ని చోట్ల గ్రౌండ్ వాటర్ పైవరకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేయలేదు. ఒప్పందం ప్రకారం సంవత్సర కాలం పాటు మరమ్మతుల బాధ్యతలు చేపట్టని గుత్తేదారులపై చర్యలు తీసుకోవాలి. అయితే జిల్లాలో ఇప్పటివరకు కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. సిర్పూర్(యూ)తోపాటు తిర్యాణి మండలం గిన్నెధరిలో కనిష్ట ఉష్ణోగ్రతలు 10 డిగ్రీలుగా నమోదవుతున్నాయి. మరికొద్ది రోజుల్లో జిల్లాలోని పలు ప్రాంతాల్లో పది డిగ్రీల దిగువకు కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోయే అవకాశం ఉంది. ఇలాంటి తరుణంలో హాస్టళ్లలోని విద్యార్థులు ఉదయమే స్నానాలు ముగించుకుని తరగతులు హాజరు కావడం కష్టంగా మారింది. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులు ఉదయమే ప్రత్యేక తరగతులకు హాజరు కావాల్సి ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి హాస్టళ్లలోని సోలార్ వాటర్ హీటర్లకు మరమ్మతులు చేపట్టాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

జిల్లాలో వారం రోజుల కనిష్ట ఉష్ణోగ్రతలు

తేదీ	ఉష్ణోగ్రత (డిగ్రీలు)
9	10.3
10	10.5
11	10.8
12	11.5
13	10.2
14	10.8
15	10.0
16	11.1



చదువుకుంటున్న విద్యార్థినులు

ఇబ్బంది అవుతుంది



చలి తీవ్రత పెరిగింది. ఉదయం పూట చన్నీటితో స్నానాలు చేయలేకపోతున్నాం. చలికి తీవ్ర ఇబ్బంది అవుతుంది. స్కూల్‌లో సోలార్ వాటర్ హీటర్లు పనిచేయడం లేదు. అధికారులు మా అవస్థలను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టాలి.
– ఎస్.పానేశ్వరి, పదో తరగతి, మోడి

నిధులు మంజూరు కాలేదు



కస్తూరిబా గాంధీ విద్యాలయాల్లోని సోలార్ వాటర్ హీటర్ల మరమ్మతులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రత్యేక నిధులు మంజూరు కాలేదు. అప్పటి వరకు ఆయా కేజీబీవీల ఎస్‌వోలు విద్యార్థినులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలి.
– ఆబిద్ అలీ, ఎస్‌వో

పార్లమెంట్‌లోనూ గెలిపించండి

- బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి సునీల్ బన్సాల్
- నిర్మల్‌లో ఎన్నికల సన్నాహక సమావేశం
- 'అసెంబ్లీ'కి ఓటేసినందుకు కృతజ్ఞతలు
- ఉమ్మడి జిల్లా నాయకులు హాజరు



ఉమ్మడిజిల్లా నేతలతో చర్చిస్తున్న బన్సాల్

నిర్మల్: 'తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఎనిమిది మంది ఎమ్మెల్యేలను గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లోనూ బీజేపీని అధిక సీట్లలో గెలిపించాలి' అని పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి సునీల్ బన్సాల్ కోరారు. నిర్మల్ జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి క్యాంప్ ఆఫీస్‌లో ఆదివారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు, రానున్న పార్లమెంట్ ఎన్నికల సమాయత్తంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సునీల్‌బన్సాల్ మాట్లాడుతూ.. ఉమ్మడి ఆదిలాబాద్‌లో నాలుగు అసెంబ్లీ సీట్లు గెలుచుకోవడం హర్షణీయమని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో రానున్న పార్లమెంట్ ఎన్నికల్లోనూ పార్టీని గెలిపించాలని కోరారు. పార్టీ నాయకులంతా ప్రజల్లోకి వెళ్లాలని, కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం పార్టీ సంస్థాగత విధానాలపై చర్చించారు. ఉమ్మడి జిల్లా బాధ్యులతో వేర్వేరుగా అభిప్రాయాలు సేకరించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, రామారావుపటేల్, పాయల్‌శంకర్, హరీశ్‌బాబు, ఆసిఫాబాద్ అభ్యర్థిగా పోటీచేసిన ఆత్మారాం నాయక్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, పార్లమెంట్ ఇన్‌చార్జి అయ్యన్నగారి భూమయ్య, పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి రావుల రాంనాథ్, జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి, ఇన్‌చార్జి మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శులు మెడిసెమ్మె రాజు, సామ రాజేశ్వర్‌రెడ్డి, నాలుగు జిల్లాల అధ్యక్షులు, ఇన్‌చార్జీలు, ప్రభారీలు, అసెంబ్లీ కన్వీనర్లు పాల్గొన్నారు.

గిరిజన మహిళకు 'జెడ్పీ చైర్‌పర్సన్' ఇవ్వాలి



మాట్లాడుతున్న సిడాం గణపతి

బెజ్జూర్(సిర్పూర్): నిబంధనల ప్రకారం గిరిజన మహిళకు జెడ్పీ చైర్‌పర్సన్ పదవి ఇవ్వకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని మాజీ జెడ్పీ చైర్మన్ సిడాం గణపతి అన్నారు. బెజ్జూర్ మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజనుల ఆరాధ్య దైవంగా పేరు పొందిన కుమురం భీం జిల్లాలో గిరిజన మహిళకు జెడ్పీ చైర్‌పర్సన్ పదవిని కట్టబెట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వారం రోజుల్లో ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో మహా ధర్నా చేపడతామని హెచ్చరించారు. బెజ్జూర్, వాంకిడి, సిర్పూర్(యూ) మండలాల్లో గిరిజన మహిళలు జెడ్పీటీసీలుగా ఉన్నారని పేర్కొన్నారు. వారిలో ఒక్కరికి జెడ్పీచైర్‌పర్సన్‌గా అవకాశం ఇవ్వాలన్నారు. నాయకులు చిన్నయ్య, భిక్షపతి, రాజారాం, ప్రకాశ్, అరుణ్, రాజు, మధుకర్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా జిల్లాస్థాయి ఎంపిక పోటీలు



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఆదివారం నెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి నెట్‌బాల్ ఎంపిక పోటీలు హోరాహోరీగా సాగాయి. వివిధ పాఠశాలల నుంచి మొత్తం 50 మంది క్రీడాకారులు పోటీలకు హాజరైనట్లు నెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అలీబిన్ తెలిపారు. ట్రెడిషనల్ బాలుర విభాగంలో 12 మంది, బాలికలు 12 మంది రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని వెల్లడించారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 30 నుంచి జనవరి 1 వరకు నల్గొండ జిల్లాలోని జోసఫ్ హైస్కూల్ జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. బాలుర విభాగంలో కౌటాల ఉన్నత పాఠశాల నుంచి ముగ్గురు, కాగజ్‌నగర్‌లోని ఫాతిమా కాన్వెంట్ స్కూల్ నుంచి ముగ్గురు, ఆసిఫాబాద్ తెలంగాణ మోడల్ స్కూల్ నుంచి ఆరుగురు, బాలికల విభాగంలో గిరిజన డిగ్రీ గురుకులం నుంచి ముగ్గురు, తెలంగాణ మోడల్ స్కూల్ నుంచి ఆరుగురు ఎంపికయ్యారని తెలిపారు. కార్యక్రమంలో నెట్‌బాల్ జిల్లా కార్యదర్శి తిరుపతి, పీఈటీ, పీడీలు హరీశ్, రాకేశ్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు కాగజ్‌నగర్‌లో జాబ్‌మేళా

ఆసిఫాబాద్: జిల్లాలోని నిరుద్యోగ యువతీయువకులకు ఈ నెల 18న కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉదయం 11 గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి రవికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. మెడ్‌ప్లస్ కంపెనీలో 40 ఫార్మసిస్టు, 50 సీఎస్సీ, 100 జూనియర్ అసిస్టెంట్, 30 ఆడిట్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఫార్మసిస్టు పోస్టులకు డీ ఫార్మసీ, బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ.. సీఎస్సీ, జూనియర్ అసిస్టెంట్, ఆడిట్ అసిస్టెంట్ పోస్టులకు ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ విద్యార్హత కలిగి ఉండాలన్నారు. 18 నుంచి 30 ఏళ్ల లోపు వారు అర్హులని పేర్కొన్నారు. ఫార్మసిస్టుకు రూ.16 వేలు, సీఎస్సీ పోస్టుకు రూ.10,500, జూనియర్ అసిస్టెంట్‌కు రూ.11,500, ఆడిట్ అసిస్టెంట్‌కు రూ.13 వేలు వేతనం చెల్లిస్తారని తెలిపారు. ఎంపికైన వారికి హైదరాబాద్‌లో ఉచిత వసతి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 99081 87894, 94405 14962 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రేడియాలజిస్టు నియామకం

జైనూర్(ఆసిఫాబాద్): మండల కేంద్రంలోని 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణులకు స్కానింగ్ చేసేందుకు రేడియాలజిస్టు అందుబాటులో లేకపోవడంతో ఈ నెల 11న ఆదివాసీ నాయకులు మండల కేంద్రంలో ధర్నా చేపట్టారు. స్పందించిన అధికారులు జైనూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో తాత్కాలిక పద్ధతిలో రేడియాలజిస్టుగా నిధిరెడ్డిని నియమించారు. ఆదివారం ఒక్కరోజే ప్రభుత్వ ఆసుపత్రిలో 90 మంది గర్భిణులకు స్కానింగ్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆదివాసీ నాయకులు రేడియాలజిస్టు నిధిరెడ్డిని సన్మానించారు. మండల వైద్యాధికారి జితేందర్ రెడ్డి, మార్లవాయి సార్‌మేడి జుగ్నక దేవురావు తదితరులు ఉన్నారు.

వేలిముద్ర మీది.. బియ్యం మావి!

పేదల కడుపు నింపాల్సిన బియ్యం.. అక్రమార్కులకు జేబులు నింపుతోంది. రాయితీ బియ్యం జిల్లా పొరుగున ఉన్న మహారాష్ట్రకు తరలిపోతోంది. దళారులతోపాటు కొంత మంది రేషన్ డీలర్లు సైతం లబ్ధిదారుల నుంచి రేషన్ బియ్యం కొనుగోలు చేసి దందాను నడిపిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

- 'పీడీఎస్' దందా చేస్తున్న కొంత మంది రేషన్ డీలర్లు
- పొరుగు రాష్ట్రానికి తరలించి సొమ్ము చేసుకుంటున్న వైనం
- అంతర్రాష్ట్ర రహదారుల గుండా అక్రమ రవాణా



సిర్పూర్(టి) మండలం కోనేరు కాలనీ సమీపంలో పట్టుకున్న బియ్యం

కౌటాల(సిర్పూర్): జిల్లాలో పీడీఎస్ బియ్యం దందాను అరికట్టడం కోసం అధికారులు, పోలీసుశాఖ చేస్తున్న ప్రయత్నాలకు కొంతమంది రేషన్ దుకాణాల డీలర్లే గండికొడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పీడీఎస్ దందాకు లోపాయికారిగా వారు సహకరిస్తుండటంతో బియ్యం తరలింపు బహిరంగానే కొనసాగుతోందనే విమర్శ వినిపిస్తోంది. జిల్లాలో ప్రతి నెలలో పీడీఎస్ బియ్యం అక్రమ తరలింపు కేసులు నమోదు కావటం చూస్తుంటే ఈ దందా స్థాయి అర్థమవుతోంది.

రూ.15 ఇచ్చి.. రూ.26కి విక్రయం
లబ్ధిదారులకు దుకాణాల వద్దే కొంతమంది రేషన్ డీలర్లు నేరుగా కిలోకు రూ.15 నుంచి రూ.16 వరకు డబ్బులు ఇచ్చేస్తున్నారు. 15- 20 క్వింటాళ్ల వరకు పోగు చేసి మహారాష్ట్రలో రూ.24 నుంచి రూ.26 వరకు విక్రయిస్తున్నారు. ఇక్కడ పాలిష్ చేసి ప్యాక్ చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కాగజ్‌నగర్ అడ్డాగా మంచిర్యాల, బెల్లంపల్లి, రెబ్బెన నుంచి, మరోవైపు ఆసిఫాబాద్ నుంచి సిర్పూర్(టి) మీదుగా చౌక బియ్యం పొరుగు ప్రాంతాలకు తరలి వెళ్తోంది. ఈ తంతు మొత్తం ప్రతినెలా రెండు, మూడు తేదీల నుంచి 20వ తేదీ వరకు కొనసాగుతుంది. మార్గమధ్యలో ఎక్కడా చెక్‌పోస్టులు లేవు. అడ్డు చెప్పే వారికి చేతులు తడిపితే చాలు.. వాహనాలు నేరుగా తెల్లవారుజాము, రాత్రి వేళల్లో పొరుగు రాష్ట్రానికి పరుగులు తీస్తున్నాయి.

నయా దందా..!
రేషన్ డీలర్లే నేరుగా లబ్ధిదారుల నుంచి బియ్యాన్ని కొనుగోలు చేసి నయా దందా సాగిస్తున్నారు. గతంలో చాలా మంది ఆరోగ్యశ్రీ కోసం రేషన్ కార్డులు పొందారు. వీరిలో చాలా మంది నేరుగా రేషన్ దుకాణాలకు వెళ్లి బియ్యం తీసుకోవడం లేదు. అలాంటి వారిని లక్ష్యంగా చేసుకుని డీలర్లు వేలిముద్రలు వేయించుకుంటున్నారు. నేరుగా అక్కడి నుంచే బియ్యాన్ని వాహనాల్లో తరలిస్తున్నారు. గతంలో లబ్ధిదారులు ఇళ్ల వద్దకు వెళ్లి ఏజెంట్లు బియ్యం సేకరించేవారు. ఇప్పుడా పరిస్థితి పూర్తిగా మారింది.

రాత్రికి రాత్రే తరలింపు..
బియ్యం అక్రమ దందాలో రేషన్ డీలర్లే ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. డీలర్లు లబ్ధిదారులకు రూపాయికి బియ్యం ఇచ్చినట్లే ఇచ్చి.. తిరిగి కొనుగోలు చేస్తున్నారు. క్వింటాళ్ల కొద్ది జమ అయ్యాక రాత్రికి రాత్రే ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ తతంగం అంతా సివిల్ అధికారులకు తెలిసినా మామూళ్ల అందుతుండడంతో కన్నెత్తి చూడడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

ఇటీవల ఘటనలు
- శనివారం సిర్పూర్(టి) మండలంలోని కోనేరు కాలనీ సమీపంలో ద్విచక్ర వాహనాలపై తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని అధికారులు పట్టుకుని, పలువురిపై కేసు నమోదు చేశారు.
- కౌటాల మండలం గురుడుపేట్‌లో గురువారం ఓ ఇంట్లో నిల్వ ఉంచిన ఏడు క్వింటాళ్ల బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు.
- 12 తేదీన బెజ్జూర్ మండల కేంద్రంలోని ఓ వ్యాపారి ఇంట్లో నిల్వ ఉంచిన ఏడు క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.
- 11న పెంచికల్‌పేట్ మండలం అగర్‌గూడలోని ఓ ఇంట్లో నిల్వ ఉన్న 3.50 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్నారు.

అంతర్రాష్ట్ర రహదారుల మీదుగానే..
సిర్పూర్(టి): సిర్పూర్ నియోజకవర్గంలోని సిర్పూర్(టి), కౌటాల, బెజ్జూర్, చింతలమానెపల్లి, కాగజ్‌నగర్, పెంచికల్‌పేట్, దహెగాం మండలాలతోపాటు ఆసిఫాబాద్, బెల్లంపల్లి, మంచిర్యాల నియోజకవర్గాల నుంచి ప్రతిరోజూ రేషన్ బియ్యం అక్రమ రవాణా కొనసాగుతోంది. సిర్పూర్(టి)- మాకిడి అంతర్రాష్ట్ర రహదారి, వెంకట్రావ్‌పేట్- పోడ్సా అంతర్రాష్ట్ర రహదారుల గుండా భారీ వాహనాలు, ఆటోలు, ట్రాలీల ద్వారా బియ్యాన్ని రవాణా చేస్తున్నారు. ఈ దందాకు టీవీఎస్ ఎక్సెల్ తరహా వాహనాలను కూడా వాడుతున్నారు. చింతలమానెపల్లి మండలంలోని గూడెం- అహేరి అంతర్రాష్ట్ర రహదారి మీదుగా కూడా దందా సాగుతోంది.

జిల్లా వివరాలు

పంచాయతీలు:	334
చౌక ధరల దుకాణాలు:	303
ఆహార భద్రత కార్డులు:	1,39,784
అంత్యోదయ కార్డులు:	13,024
అన్నపూర్ణ కార్డులు:	21
ప్రతినెలా పంపిణీ చేసే బియ్యం:	3 వేల మెట్రిక్ టన్నులు

కేసుల వివరాలు (ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు)

6- ఏ కేసులు:	74
పట్టుకున్న బియ్యం:	1,222 క్వింటాళ్లు
విలువ:	రూ.31 లక్షలు
క్రిమినల్ కేసులు:	29
కేసులు నమోదైన వారి సంఖ్య:	67 మంది

కేసులు నమోదు చేస్తాం
అక్రమంగా రేషన్ బియ్యం రవాణా చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. జిల్లాలోని రేషన్ డీలర్లు ప్రభుత్వ నిబంధనలు పాటించాలి. లబ్ధిదారులకు బియ్యానికి బదులుగా నగదు ఇస్తే షాప్ సీజ్ చేస్తాం. డీలర్లు సక్రమంగా బియ్యం సరఫరా చేయకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలి.
– శ్రీనివాస్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ, కాగజ్‌నగర్

వలస.. ఏదీ భరోసా?



గల్ఫ్ వెళ్తున్న వారికి వీడ్కోలు పలుకుతున్న కుటుంబ సభ్యులు (ఫైల్)



గల్ఫ్‌లో పనిచేస్తున్న కార్మికులు (ఫైల్)

ఉన్న ఊరిలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు తగ్గిపోతుండడంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాసులు వలసబాట పడుతున్నారు. ఉపాధి అవకాశంతో పాటు అధిక వేతనాలు, మరింత మెరుగైన జీవనం కోసం వేరే ప్రాంతాలకు వెళ్లడం.. పల్లెల నుండి పట్టణాలకు, ఒక రాష్ట్రం నుండి మరో రాష్ట్రానికి వెళ్లడాన్ని అంతర్గత వలసలు అంటారు. ఒకదేశం నుండి మరో దేశానికి వెళ్లడాన్ని అంతర్జాతీయ వలసలు అంటారు. నేడు అంతర్జాతీయ వలసదారుల దినోత్సవం నేపథ్యంలో 'సాక్షి' ప్రత్యేక కథనం...



"నిర్మల్ జిల్లా సోన్ మండల కేంద్రానికి చెందిన గాండ్ల రమణ ఉపాధి నిమిత్తం దాదాపు 12 ఏళ్లక్రితం ఒమన్ దేశానికి వెళ్లి కొన్ని నెలలక్రితం స్వగ్రామానికి వచ్చాడు. ఇక్కడ స్వయం ఉపాధి పొందేందుకు బీసీ వర్గానికి చెందిన వ్యక్తిగా తనకు ఏదైనా రుణం మంజూరు చేయించాలని కొన్నిరోజులక్రితం కలెక్టరేట్, డీఆర్డీవో, తదితర కార్యాలయాల్లో విన్నవించుకున్నాడు. రుణం మంజూరు కోసం కృషి చేస్తామని అధికారులు హామీ ఇచ్చినా ఇప్పటికీ ఎలాంటి సాయం అందలేదని గాండ్ల రమణ పేర్కొంటున్నాడు. గల్ఫ్ నుండి వాపస్ వచ్చిన ఇలాంటి వారు ఎందరో ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాల కోసం అన్వేషిస్తున్నారు.

- ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు..
- తిరిగొచ్చాక భరోసా కరువు..
- ఉమ్మడి జిల్లాలో లక్షలాది మంది వలస కార్మికులు
- నేడు అంతర్జాతీయ వలసదారుల దినోత్సవం

నిర్మల్‌ఖిల్లా: ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వలసదారులు ఉజ్వల భవిష్యత్, తగిన గుర్తింపు కోసం తమ మాతృభూమిని వదిలి వేరొక దేశానికి వెళ్తుంటారు. ఉమ్మడి జిల్లా నుంచి సుమారు 80 వేలకు పైగా కార్మికులు వివిధ దేశాలకు ఉపాధి నిమిత్తం వెళ్లినట్లు గల్ఫ్ సంక్షేమ సంఘాలు పేర్కొంటున్నాయి. వీరే కాకుండా గల్ఫ్ దేశాల నుంచి తిరిగొచ్చిన జిల్లా వాసులు దాదాపు 2 లక్షల వరకు ఉంటారని ప్రవాసీమిత్ర కార్మిక సంఘాల నాయకులు పేర్కొంటున్నారు. జిల్లా నుంచి గల్ఫ్‌కు వెళ్తున్న వ్యక్తులకు సాంకేతిక పరిజ్ఞానం లేకపోవడంతో ఎక్కువ మంది కూలీలు గానే పనులు చేస్తున్నారు. తిరిగొచ్చిన తర్వాత కూడా సరైన ప్రత్యామ్నాయ, ఉపాధి మార్గాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఇదీ నేపథ్యం..

వలస వెళ్తున్న పౌరులకోసం ఐక్యరాజ్య సమితి డిసెంబర్ 18ని అంతర్జాతీయ వలసదారుల దినోత్సవం (ఇంటర్నేషనల్ మైగ్రంట్స్ డే)గా ప్రకటించింది. ఈ మేరకు ఐక్యరాజ్య సమితి సర్వప్రతినిధుల సభ (యునైటెడ్‌నేషన్స్ జనరల్ అసెంబ్లీ) 31 ఏళ్ల క్రితం 18 డిసెంబర్ 1990 సంవత్సరంలో జరిగిన సమావేశంలో 'వలస కార్మికులు, కుటుంబ సభ్యుల హక్కుల రక్షణ' గురించి ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ఎంత స్వేచ్ఛా స్వతంత్రంగా విదేశాలకు వెళ్తున్నారో అంతే స్వేచ్ఛగా తిరిగిరావొచ్చని సభ తీర్మానం చేసింది.

ప్రధాన డిమాండ్లు

- తెలంగాణ రాష్ట్రంలో సమగ్ర ఎన్నారై పాలసీ (ప్రవాసీ విధానం) ప్రవేశపెట్టాలని, గల్ఫ్ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలనే డిమాండ్ చాలాకాలంగా అమలుకు నోచుకోవడంలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన పదేళ్లలో 6 వేలకు పైగా తెలంగాణ ప్రవాసీయులు గల్ఫ్ దేశాలలో వివిధ కారణాలతో మృతి చెందగా రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియా కోసం కుటుంబాలు ఎదురుచూస్తున్నాయని, రూ.500 కోట్ల వార్షిక బడ్జెట్‌తో గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి, పునరావాసానికి కృషి చేయాలని ప్రవాసీమిత్ర లేబర్ యూనియన్, గల్ఫ్ కార్మిక సంఘాల నాయకులు కోరుతున్నారు.
- విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వారు ముంబయిలో ఏర్పాటు చేసిన మాదిరి హైదరాబాద్‌లో 'విదేశ్‌భవన్' ఏర్పాటు చేయాలని, ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్‌లో పాస్‌పోర్టు ఆఫీసు, ప్రొటెక్టర్ ఆఫ్ ఎమిగ్రంట్స్ ఆఫీసు, ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్(ఐసీసీఆర్) రీజినల్ ఆఫీసు, విదేశాంగ శాఖ బ్రాంచి సెక్రెటేరియట్లు ఉండాలని, 'ప్రవాసీ తెలంగాణ దివస్' అధికారికంగా నిర్వహించాలని కోరుతున్నారు.

వలసదారుల సంక్షేమానికి కృషి చేయాలి



వలస కార్మికుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలి. కేరళ తరహా ప్రత్యేక గల్ఫ్ బోర్డు ఏర్పాటు చేయాలి. వార్షిక బడ్జెట్‌లో రూ.500 కోట్ల నిధులు కేటాయించాలి. మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి. గల్ఫ్‌లో రాష్ట్ర ప్రభుత్వం మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేయాలి. తిరిగి వచ్చిన కార్మికులకు ఉపాధికోసం ఆయా వ్యక్తుల నైపుణ్యాలను బట్టి ప్రభుత్వాలు తగిన చేయూతనివ్వాలి.

– కృష్ణ, గల్ఫ్ జేఏసీ రాష్ట్ర నాయకుడు

రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనివి..

- అమాయకులైన వలస కార్మికుల రక్షణకు ఆరు అరబ్ గల్ఫ్ దేశాలతో సహా 18 దేశాలను ఈసీఆర్ దేశాలుగా వర్గీకరించిన 1983 లోని ఎమిగ్రేషన్ చట్టం యొక్క ప్రాతిపదిక ప్రకారం గల్ఫ్ బోర్డు ఏర్పాటు చేయాలి. గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి రూ.500 కోట్ల వార్షిక బడ్జెట్ కేటాయించాలి. గల్ఫ్ మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి.
- జీవిత బీమా, ప్రమాద బీమా, ఆరోగ్య బీమా, పెన్షన్‌లతో కూడిన సమగ్రమైన సాంఘిక భద్రత (సోషల్ సెక్యూరిటీ) పథకం ప్రవేశ పెట్టాలి.
- గల్ఫ్‌కు వెళ్లిన సన్నకారు, చిన్నకారు రైతులకు రైతుబంధు, రైతు బీమా పథకం వర్తింపజేయాలి.

కేంద్ర ప్రభుత్వం పరిధిలోనివి..

- హైదరాబాద్‌లో సౌదీ, యూఏఈ, కువైట్ దేశాల కాన్సులేట్‌లు (రాయబార కార్యాలయాలు) ఏర్పాటయ్యేలా కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలి.
- ప్రవాస భారతీయ బీమా యోజన అనే రూ.10 లక్షల విలువైన ప్రమాద బీమా పథకంలో సహజ మరణం కూడా చేర్చాలి. రూ.325 చెల్లిస్తే రెండు సంవత్సరాల కాలపరిమితితో ఇన్సూరెన్స్ ఇస్తారు. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పరిధిలోని ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలి.
- ఎమిగ్రేషన్ యాక్టు–1983 ప్రకారం గల్ఫ్ దేశాలకు ఉద్యోగానికి వెళ్ళడానికి సర్వీస్ చార్జీగా అభ్యర్థి 45 రోజుల వేతనం (రూ.30 వేలకు మించకుండా) మాత్రమే ఏజెంటుకు చెల్లించాలి. దీనిపై 18 శాతం జీఎస్టీ రూ.5,400 చెల్లించాల్సి ఉంటుంది. జీఎస్టీని పూర్తిగా రద్దు చేయాలి.

క్లుప్తంగా

ప్రభుత్వ పాఠశాలలో అగ్ని ప్రమాదం



పాఠశాలలో చెలరేగుతున్న మంటలు

లక్సెట్టిపేట(మంచిర్యాల): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత బాలుర పాఠశాలలో ఆదివారం ఉదయం అగ్ని ప్రమాదం జరిగింది. అకస్మాత్తుగా మంటలు వ్యాప్తి చెలరేగడంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై లక్ష్మణ్ సంఘటన స్థలానికి చేరుకుని ఫైరింజన్‌కు సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పడంతో చుట్టు పక్కల మంటలు వ్యాపించలేదు. ఘటనలో మధ్యాహ్న భోజన సామగ్రి, టేబుళ్లు, ఫర్నిచర్, ల్యాబ్, తరగతి గదులు దగ్ధమయ్యాయి. సుమారు రూ.5 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగింది. ప్రమాదం ఎలా జరిగింది అనేది అంతుచిక్కడం లేదు. ఆకతాయిల వల్ల జరిగిందా? విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో జరిగిందా అనేది తెలియడంలేదు. ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు వ్యాపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సెలవు రోజు కావడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

బాసరలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పూజలు



మంత్రికి చిత్రపటం ఇస్తున్న ఆలయ ఈవో

భైంసా: రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ నిర్మల్ జిల్లా బాసర శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారిని ఆదివారం దర్శించుకున్నారు. దేవాదాయ శాఖ మంత్రిగా నూతనంగా బాధ్యతలు చేపట్టి తొలిసారిగా దేవస్థానానికి వచ్చారు. ఆలయ ప్రధానార్చకులు ఆమెకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో విజయరామారావు, అర్చకులు, పండితులు అమ్మవారి చిత్ర పటం అందజేసి శాలువాతో సన్మానించారు. అర్చకులు అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

మందమర్రిరూరల్(చెన్నూర్): సింగరేణిలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆదివారం సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్మికులు కొత్తగూడెం ఎమ్మెల్యే, ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షుడు కూనంనేని సాంబశివరావుకు వినతిపత్రం అందించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాంట్రాక్ట్ కార్మికుల కోసం ఐదు జీవోలు జారీ చేసినా కార్పొరేటర్లకు నష్టం కలుగుతుందని గెజిట్ చేయలేదన్నారు. ఆ జీవోలు అసెంబ్లీలో గెజిట్ అయ్యేలా చూడాలని కోరారు.

మంత్రులను కలిసిన అటవీ కేంద్ర ఫోరం సభ్యులు



అటవీ మంత్రి సురేఖకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న తెలంగాణ అటవీ కేంద్ర ఫోరం రాష్ట్ర బాధ్యులు



భట్టి విక్రమార్కకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న తెలంగాణ అటవీ కేంద్ర ఫోరం రాష్ట్ర బాధ్యులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): తెలంగాణ అటవీ కేంద్ర ఫోరం సభ్యులు హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో రాష్ట్ర మంత్రులను ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ అటవీ కేంద్ర ఫోరం ద్వారా అటవీ ఉద్యోగుల సమస్యలను అటవీ మంత్రి సురేఖ దృష్టికి తీసుకువెళ్లగా సానుకూలంగా స్పందించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు మల్లయ్య తెలిపారు. మంత్రులను కలిసిన వారిలో తెలంగాణ అటవీ కేంద్ర ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు పొన్న మల్లయ్యతోపాటు టీఎన్జీవో అటవీ శాఖ కేంద్ర ఫోరం కార్యదర్శి అశ్వక్ ఉర్ రెహమాన్, ఉపాధ్యక్షులు ప్రభాకర్, సంతోష్, కాళేశ్వరం సర్కిల్ కార్యదర్శి వెంకటకృష్ణ ఉన్నారు.

టూరిజంతో టైగర్‌జోన్ అభివృద్ధి

- ప్రొఫెసర్ రంజాన్ విరాని



మాట్లాడుతున్న రంజాన్ విరాని

జన్నారం: టైగర్‌జోన్‌లో టూరిజం అభివృద్ధి జరిగితేనే టైగర్‌జోన్ అభివృద్ధి జరుగుతుందని, దీనిద్వారా వన్యప్రాణుల సంఖ్య పెరుగుతుందని తిప్పేశ్వర్ టైగర్‌జోన్, గౌరవ వన్యప్రాణుల సంరక్షకులు (హానరరీ వైల్డ్‌లైఫ్ వార్డెన్) ప్రొఫెసర్ రంజాన్ విరాని అన్నారు. మహారాష్ట్రలోని యావత్మాల్ జిల్లాకు చెందిన ఆయన ఆదివారం కవ్వాల్ టైగర్‌జోన్ పరిధిలోని రేంజ్, సెక్షన్, బీట్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. ప్రొజెక్టర్ ద్వారా పలు అంశాలను అధికారులకు వివరించారు. అడవి అభివృద్ధిలో ఆదివాసీ గిరిజనులను భాగస్వామ్యం చేయాలని సూచించారు. వన్యప్రాణుల ద్వారా నష్టం జరిగిన వారికి వెంటనే పరిహారం అందేలా చూడాలన్నారు. అడవిలో పర్యటించేందుకు పర్యాటకులు సుముఖత చూపుతారని, ఈ అవకాశం సద్వినియోగం చేసుకుని ఏకో టూరిజం అభివృద్ధి చేయాలన్నారు. దీనిద్వారా ఆర్థిక వనరులు సమకూర్చుకోవాలన్నారు. అనంతరం టైగర్‌జోన్ పరిధిలో జరిగే విషయాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. వారి సందేహాలు నివృత్తి చేశారు. కార్యక్రమంలో రేంజ్ అధికారులు హఫీజొద్దీన్, సుష్మరావు, రవి, ఇక్బాల్, గులామ్ మొయినొద్దీన్, శంకర్, రామకృష్ణ, గోవింద్ సర్దార్, ఎన్‌జీవో సభ్యుడు ఎల్లం, డీఆర్వో తిరుపతి, సిబ్బంది పాల్గొన్నారు.

కేవైసీ కోసం వచ్చి ఒకరు మృతి

ఎదులాపురం: గ్యాస్ కేవైసీ కోసం వచ్చి ఒకరు మృతిచెందిన ఘటన పట్టణంలో చోటుచేసుకుంది. వన్‌టౌన్ ఎస్సై జి.నారాయణస్వామి కథనం ప్రకారం..సిరికొండ మండలానికి చెందిన అంగ పొచన్న (40) తన కుమారుడు చరణ్‌తో కలిసి శనివారం ఆదిలాబాద్‌లోని ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ వద్దకు వచ్చారు. జనం రద్దీ ఉండడంతో ఎలాగోలా వస్తానని చెప్పి కుమారుడిని వెళ్లిపోమన్నాడు. శనివారం రాత్రి అయినా పొచన్న రాలేదు. ఆయన తండ్రి స్వామి, బావ రమేశ్ ఆదివారం గ్యాస్ ఏజెన్సీ సమీప ప్రాంతాల్లో గాలించారు. ఏజెన్సీ ఎదురుగా ఉన్న రెండు లారీల మధ్యలో పొచన్న పడుకుని ఉన్నాడు. లేపేందుకు ప్రయత్నించగా ఎలాంటి చలనం లేకపోవడంతో మృతిచెందినట్లు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. మద్యం తాగి, రాత్రి తినకుండా ఆరుబయట పడుకోవడంతో చలికి బిగుసుకుపోయి మృతిచెందినట్లు వైద్యులు నివేదిక ఇచ్చారు. మృతుడి తండ్రి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి

- ఎస్సీ, ఎస్టీ టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాజన్న



సమావేశంలో మాట్లాడుతున్న రాజన్న

జన్నారం: బదిలీ జరిగి రిలీవ్ కాని ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జాడి రాజన్న డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులందరికీ ప్రత్యేక టెట్ నిర్వహించి పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. జన్నారంలో ఆదివారం మాట్లాడారు. జీవో 317 బాధిత ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని, సొంత జిల్లాలకు పంపాలని డిమాండ్ చేశారు. పదేళ్లుగా విద్యారంగం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగం పటిష్టతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. సర్వీస్ రూల్స్ సమస్య పరిష్కరించి, ఉపాధ్యాయ నియామకాలపై తక్షణ నిర్ణయం తీసుకోవాలన్నారు. సమావేశంలో ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ప్రకాశ్‌నాయక్, జిల్లా బాధ్యుడు వినోద్ పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా.. బాలుడు మృతి

భైంసా: ట్రాక్టర్ బోల్తా పండి బాలుడి మృతిచెందిన ఘటన మండలంలోని దేగాంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బొగ్గుల యోగేశ్(16) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో తండ్రి పోతన్నతో కలిసి ట్రాక్టర్‌పై పొలానికి వెళ్లాడు. పనులు ముగించుకుని సాయంత్రం ఇంటికి తిరిగి వస్తుండగా ట్రాక్టర్ నడుపుతున్న పోతన్న ముళ్లకంపను తప్పించబోగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తాపడింది. యోగేశ్‌పై ట్రాక్టర్ పడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్సై శ్రీకాంత్ ఘటనాస్థలాన్ని సందర్శించారు.

'ఎగిరేది ఏఐటీయూసీ జెండానే'

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాంబశివరావు

మందమర్రిరూరల్(చెన్నూర్): ఈ నెల 27న జరగనున్న సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో ఎగిరేది ఏఐటీయూసీ జెండానే అని కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షుడు కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆదివారం మందమర్రి ఏరియాలోని సీఈఆర్ క్లబ్ ఆవరణలో నిర్వహించిన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఏరియా స్థాయి జనరల్ బాడీ మీటింగ్‌కు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత గుర్తింపు సంఘం సంస్థను నిర్వీర్యం చేసిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల ఒప్పందంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఏఐటీయూసీకి మద్దతు ఇస్తుందన్నారు. ప్రభుత్వ పార్టీలకు అనుబంధ సంఘాలను కార్మికులు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య మాట్లాడుతూ టీబీజీకేఎస్ నాయకులను నమ్మే పరిస్థితిలో లేరన్నారు. యూనియన్ మందమర్రి బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర ఇన్‌చార్జి బోసు, యూనియన్ అడిషనల్ జనరల్ సెక్రెటరీ మిర్యాల రంగయ్య, కాసిపేట బ్రాంచ్ కార్యదర్శి మల్లేశ్, ఆర్కేపీ బ్రాంచ్ సెక్రెటరీ అంజనేయులు, నాయకులు చిప్ప నర్సయ్య, సుదర్శన్, శ్రీనివాస్, రాజేశం, తదితరులు పాల్గొన్నారు.

'అసెంబ్లీలో కార్మికుల గొంతు వినిపిస్తా'

శ్రీరాంపూర్: అసెంబ్లీలో కార్మికుల గొంతు వినిపిస్తానని కొత్తగూడెం ఎమ్మెల్యే, ఏఐటీయూసీ గౌరవాధ్యక్షుడు కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆదివారం నస్పూర్ కాలనీలోని సింగరేణి సేవా భవన్ మైదానంలో యూనియన్ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అనేక మంది ఏఐటీయూసీ నేతల ప్రాణత్యాగం ఫలితంగా సింగరేణి కార్మికులకు హక్కులు, సదుపాయాలు కలిగాయన్నారు. సింగరేణి సీఎండి శ్రీధర్ ఎనిమిదిన్నర సంవత్సరాలుగా ఇక్కడే తిష్ట వేశారని, ఆయన లెక్కలు తీసేదాకా వదిలిపెట్టేది లేదన్నారు. అంతకుముందు ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వీ సీతారామయ్య మాట్లాడుతూ దొరల పాలన అంతం చేయడానికి తాము కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చామని ఇప్పుడు సింగరేణిలో టీబీజీకేఎస్ అంతం చేయడానికి కార్మికులంతా మద్దతుగా నిలువాలని పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేని శంకర్, యూనియన్ ఇన్‌చార్జి వీకే బోస్, అడిషనల్ జనరల్ సెక్రెటరీ మిరియాల రంగయ్య, కే.వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, ఎస్కే బాజీసైదా, జిల్లా కార్యదర్శి మేకల దాసు పాల్గొన్నారు.

'విశ్రాంత కార్మికుల సమస్యలు తీర్చాలి'



లేఖను ప్రదర్శిస్తున్న విశ్రాంత కార్మికులు

మంచిర్యాలటౌన్: సింగరేణి విశ్రాంత కార్మికుల సమస్యలు తీర్చాలని సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సింగరేణిలోని 5 జాతీయ కార్మిక సంఘాలు, ప్రాంతీయ కార్మిక సంఘాల నాయకులకు బహిరంగ లేఖ రాశారు. 25 నుంచి 50 శాతంకు పెన్షన్ పెంపుదల, కనీస పెన్షన్ రూ.15 వేలు, కార్మికులకు రూ.20 లక్షల గ్రాట్యుటీ, మెడికల్ స్కీంలో రూ.25 లక్షల వైద్య ఖర్చులను చెల్లించేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సింగరేణి విశ్రాంత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, పూదరి నర్సయ్య, జామర్ల జ్ఞాని, రాళ్లబండి రాజన్న, విగ్నేశ్, తదితరులు పాల్గొన్నారు.

దున్నపోతు చంపేసింది..

- రెండు రోజుల క్రితమే మరో కాపరిపై రెండుసార్లు దాడికి యత్నం
- తాజాగా పశువులను తోలుకొస్తుండగా కాపరిని పొడిచి చంపిన వైనం
- ఖానాపూర్ మండలంలో ఘటన



గంగన్న(ఫైల్)

ఖానాపూర్: పశువుల కాపరిపైనే దున్నపోతు దాడి చేసి చంపిన ఘటన నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం రాజూరాలో ఆదివారం సాయంత్రం జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పశువుల కాపరి చామన్‌పల్లి గంగన్న (60) రోజువారీలాగానే గేదెలను ఉదయం మేతకు తీసుకెళ్లాడు. వారివెంట గ్రామానికి చెందిన విత్తనపు దున్నపోతు కూడా వెళ్లింది. సాయంత్రం గేదెలను ఇంటికి తోలుకొస్తుండగా దున్నపోతు ఒక్కసారిగా కాపరిపై తిరగబడింది. విచక్షణ రహితంగా కుమ్మడంతో గంగన్న తీవ్రంగా గాయపడ్డాడు. పక్కనే ఉన్న మరో కాపరి గమనించి వెంటనే గ్రామస్తులకు ఫోన్‌చేసి చెప్పాడు. వెంటనే వారు ఘటన స్థలానికి చేరుకుని దున్నపోతును తరిమారు. గాయపడిన గంగన్నను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. గంగన్నకు భార్య ఆశవ్వ, ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

పగబట్టిందంటున్న గ్రామస్తులు..

ఇదిలా ఉండగా.. గ్రామానికి చెందిన విత్తనపు దున్న పగపట్టి దాడిచేసిందని గ్రామస్తులు ప్రచారం చేస్తున్నారు. మూడు రోజుల క్రితం గ్రామానికి చెందిన ముత్యంపై దాడికి యత్నించడంతో ఇందుకు సంబంధించిన వీడియోను కూడా సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి శుక్రవారం చనిపోగా అతని అంత్యక్రియల్లో ముత్యం పాల్గొన్నాడు. ఈ క్రమంలో అక్కడే మేతకు వెళ్లిన దున్న పరిగెత్తుకుంటూ వచ్చి దాడికి యత్నించింది. దీంతో అతను చెట్టుపైకి ఎక్కి ప్రాణాలు కాపాడుకున్నాడు. ఈ దృశ్యాన్ని స్థానికులు వీడియో తీశారు. దున్నపోతును గ్రామం నుంచి తరలించాలని సర్పంచ్‌ను కోరారు. ఇంతలోనే ఆదివారం అదే దున్న పశువుల కాపరిని పొడిచి చంపింది. దున్నపోతు మనుషులను పగబట్టిందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.



శుక్రవారం దున్నపోతు నుంచి తప్పించుకునేందుకు చెట్టెక్కిన ముత్యం